క్లుప్తంగా

పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలి



డోర్నకల్: పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రమీలారావు ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాకార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. డోర్నకల్ పీహెచ్‌సీ పనితీరు మెరుగ్గా ఉన్నా.. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీఓ నాగేశ్వర్‌రావు, వైద్యాధికారి సాధ్విజ పాల్గొన్నారు.

దీప్తి జీవాంజి యువతకు స్ఫూర్తి



మహబూబాబాద్ అర్బన్: పాఠశాల స్థాయి నుంచి అథ్లెటిక్స్‌తో అంతర్జాతీయంగా జపాన్‌లో పారా ఒలంపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన దీప్తి జీవాంజి నేటి యువతకు స్ఫూర్తి అని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సలహాదారుడు మైస శ్రీనివాసులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో దీప్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి విష్ణువర్ధన్, సభ్యులు నాగేశ్వర్‌రావు, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక వేలం రూ.1,03,100

గార్ల: మండలంలోని ముల్కనూరు పంచాయతీ పరిధిలో సీజ్ చేసిన ఇసుకకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన వేలంలో రూ.1,03,100 పలికింది. ఈవేలంలో అత్యధిక ధర పెట్టిన చాంద్‌మల్ ఇసుకను దక్కించుకున్నాడని తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు.

మొక్కజొన్న చేను దగ్ధం

కొత్తగూడ: ప్రమాదవశాత్తు మొక్కజొన్న చేను దగ్ధమైన సంఘటన మండలంలోని పెగడపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి సమీపంలో బొల్లు రవి ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పక్కనే ఉన్న పొలాల్లో వచ్చిన మంటలు గాలికి వ్యాపించి చేను అంటుకుంది. గిట్టని వ్యక్తులే మంట పెట్టి ఉంటారని బాధిత రైతు రవి ఆరోపించాడు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

అమీనాపురంలో..

కేసముద్రం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యార రమేశ్ అనే రైతు సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చింది. ఈమేరకు కంకులను విరిచి కుప్పలుగా పోశాడు. ఈక్రమంలో పక్కన మరో రైతు పంట చేనులో చెత్తను దహనం చస్తుండగా, గాలి వీచడంతో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగిసిపడి మొక్కజొన్న పంటకు నిప్పంటుకుంది. దీంతో మంటలు వ్యాపిస్తుండడంతో, అక్కడున్న రైతులు మోటార్ ద్వారా మంటలపై నీళ్లను చల్లి మంటలను ఆర్పేశారు. కాగా పంటచేనులో అక్కడక్కడ కుప్పలుగా పోసిన కంకులు కాలిపోవడంతో నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం



మరిపెడ రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్ర ఏర్పాటు చేయడం జరిగిందని జన వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర అన్నారు. మంగళవారం మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో పెండం లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉపేంద్ర ప్రారంభించారు.

డోర్నకల్: స్థానిక గ్రంథాలయంలో మంగళవారం జిల్లా బీజేపీ మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ నాయకులు లక్ష్మీనారాయణ, బాసాని నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామంలో బాలవికాస అనుబంధ సంస్థ జన నికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రమ, దాత బొమ్మెర స్వప్న నాగేష్, రామకృష్ణా రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షం.. అంతా ఆగమాగం

- నేలవాలిన వరి, మొక్కజొన్న, రాలిన మామిడి
- కొట్టుకుపోయిన ఇంటి పైకప్పులు
- రహదారులపై విరిగిపడిన చెట్లు

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లో సోమవారం అర్ధరాత్రి వరకు గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో మున్సిపాలిటితోపాటు, కల్వల, గాంధీపురం, ధన్నసరి, ఉప్పరపల్లి, తాళ్లపూసపల్లి, నారాయణపురం, ఉప్పరపల్లి, బిచ్యానాయక్‌తండా తోపాటు, ఆయా గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలగా, మామిడి కాయలు రాలి పడ్డాయి. ఇంటి పైకప్పులు లేచి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా డీఏఓ విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ వెంకన్నలు ఆయా గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారు.

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి వీచిన గాలులకు మామిడి తోటలకు తీవ్రనష్టం వాటిల్లింది. డోర్నకల్ పట్టణ సమీపంలో బుద్దారంతండాకు చెందిన భూక్యా సంద్యానాయక్‌కు చెందిన మామిడి తోటలో గాలులకు భారీగా మామిడికాయ నేలరాలింది.

మహబూబాబాద్: అకాల వర్షంతో జిల్లా కేంద్రంలో తీవ్రనష్టం జరిగింది. గాలి వాన బీభత్సాన్ని సృష్టించింది. గాలిదుమారం కారణంగా జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో వెంకటమల్లు ఇల్లు కూలిపోయింది. 36వ వార్డు పరిధిలోని తొమ్మిదో పోర్షన్ దగ్గర భారీ వృక్షం విరిగి, కారు మీద పడింది.

కురవి: కురవి, సీరోలు మండలాల్లోని పలుగ్రామాల్లో సోమవారం రాత్రి కురిసిన అకాలవర్షంతో రైతులు ఆగమాగమయ్యారు. మంగళవారం నేలవాలిన వరి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. అదేవిధంగా పలుచోట్ల మామిడి కాయలు నేల రాలాయి. నల్లెల్ల, లచ్చిరాంతండాల్లో ఇంటి పైకప్పులు లేచిపడగా, రెవెన్యూ అధికారులు ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు.

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో 284 ఎకరాల వరి పంట, 10 ఎకరాల మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. రాజులకొత్తపల్లిలో 200 ఎకరాల వరి పంట దెబ్బతిని నష్టం వాటిల్లిందని ఏఓ ఎస్‌కె యాస్మిన్ తెలిపారు. మండలంలోని శ్రీరామగిరి, నైనాల, కాచికల్, రాజులకొత్తపల్లి, నెల్లికుదురు గ్రామాలల్లో 52ఎకరాలల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయని హెచ్‌ఓ అనిత తెలిపారు.

నర్సింహులపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో 70 ఎకరాల వరకు మామిడి, సుమారు 80 ఎకరాల్లో వరి, 30 ఎకరాలల్లో మొక్కజొన్న పంట నష్టం వాటిల్లినట్లు మంగళవారం ఏఓ వినయ్‌కుమార్ తెలిపారు.



కేసముద్రం: దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల



నెల్లికుదురు: నైనాల గ్రామంలో నేలరాలిన మామిడి కాయలు



కురవి: లచ్చిరాంతండాలో ఎగిరిపోయిన ఇంటిపై కప్పు



మహబూబాబాద్: 36వ వార్డు పరిధిలో కూలిన చెట్టు



కేసముద్రం: గాంధీపురం సమీపంలో ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు



కొత్తగూడ: గుంజేడు ముసలమ్మ ఆలయం ఎదుట కూలిన రేకుల షెడ్డు



కేసముద్రం: కల్వలలో నేలవాలిన మొక్కజొన్న పంట

కొత్తగూడ: గత రెండు రోజులుగా ఈదురు గాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈదురుగాలుల దాటికి గుంజేడు ముసలమ్మ ఆలయం ఎదుట ఉన్న రేకుల షెడ్డు కుప్పకూలింది.



డోర్నకల్: రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

గంగారం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి వీచిన గాలివాన బీభత్సానికి మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇంటిపై కప్పులు లేచిపోయాయి.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

చిన్నగూడూరు: రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండంరాజుపల్లి, పగిడిపల్లి గ్రామాలలో పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు రాంరెడ్డి, రాజేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..

కురవి: కురవి, సీరోలు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, చైర్మన్‌లు ఇస్లావత్ సుధాకర్, వెంకట్‌రెడ్డి, గోపానాయక్, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై నమ్మకం పెరిగింది

డోర్నకల్: సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా పేదలకు అందుతుండడంతో కాంగ్రెస్ పాలనపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని జోగ్యాతండా, బొడ్రాయి తండా, పెరుమాళ్లసంకీస గ్రామాల్లో మంగళవారం జైబాపూ, జైభీమ్, జైసంవిదాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసం శేఖర్, నాయకులు వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి

పెద్దవంగర: నాణ్యత గల విత్తనాలను ఎంచుకొని, అధిక దిగుబడులు సాధించాలని ఏఓ స్వామి నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలోని అవుతాపురం క్లస్టర్ పరిధిలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పత్తి విత్తన సాగులో ముందస్తు సాగు ప్రణాళికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు విశ్వశాంతి, రాజు, యశస్విని, రైతులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాల పేరుతో దగా

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

బయ్యారం: ఇందిరమ్మ పైలట్ గ్రామం పేరుతో అర్హులందరికీ ఇళ్ల మంజూరు చేస్తున్నట్లు పత్రాలు ఇచ్చి, తరువాత పత్రాలను తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దగా చేసిందని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. మండలంలోని నామాలపాడులో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నామాలపాడులో 115మందికి ఇంటి నిర్మాణాలు నిమిత్తం మంజూరు పత్రాలు ఇచ్చి, ప్రస్తుతం 15మందికే ఇళ్ల మంజూరైనట్టు తెలపడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇళ్లు ఇస్తుందని గ్రామస్తులు పాతగుడిసెలను తొలగించుకున్నారని ఇప్పుడు వారికి ఇళ్లు ఇవ్వకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలని లేని ఎడల ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. అనంతరం గంధంపల్లి-కొత్తపేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల కమిటీ సమావేశంలో పాల్గొని రజతోత్సవసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గణేష్, సత్యనారాయణ, మురళీకృష్ణ, ఐలయ్య, లక్ష్మణ్‌నాయక్, భద్రయ్య శరత్, వీరన్న, మమత, జగన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఎంపీడీఓకు సమ్మె నోటీస్

గార్ల: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19నుంచి సమ్మెకు దిగుతున్నట్లు మంగళవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీఓకు సమ్మె నోటీస్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దాసు, దస్తగిరి, రమేష్, సుధాకర్, సతీష్, నరేష్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్‌లో..

మరిపెడ రూరల్: ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ ఉద్యోగుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని మండల గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జానీమియా, యాదగిరి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఎంపీఓ సోంలాల్‌ను కలిసి సంఘం ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమలో ఎల్లమ్మ, యాకుబ్, శ్రీనివాస్, పరశురాములు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసనలు

గార్ల: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి సామాన్యులపై భారం వేసిందని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి సత్యవతి మాట్లాడారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, వీరస్వామి, రమ, మౌలానా, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కట్టిబోయిన శ్రీనివాస్ మాట్లాడారు.

పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలి

కురవి: పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుడమ వెంకన్న, కన్నెం వెంకన్న, నిలిగొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



గార్ల: నిరసన తెలుపుతున్న నాయకులు

స్థానిక సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌శర్మ

డోర్నకల్: బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం పోరాడాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కె.శ్యాంసుందర్‌శర్మ కోరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గావ్ చలో బస్తీ చలో' కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, బస్తీల్లో పర్యటించి అక్కడి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం పోరాడాలని సూచించారు. డోర్నకల్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అనేక సమస్యలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పార్టీ నాయకులు సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దేవానాయక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ లక్ష్మీనారాయణ, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెహమాన్, నాయకులు శ్రీకాంత్, కళ్యాణ్, హనుమంతు, మిందుకుమార్, రవి పాల్గొన్నారు.

మోదీ పాలనలో పేదలకు అన్యాయం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెల్లికుదురు: మోదీ పాలనలో దేశంలోని పేదలకు తీరని అన్యాయం జరుగుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న అన్నారు. అఖిల భారత నిరసన దినాన్ని పాటిస్తూ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై మరింత భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి రవి, ఈక బిక్షం, సూర్యం, సత్యం, యాకయ్య, రంగయ్య, రాములు, ఎల్లయ్య, జానకీరాముడు, ఎల్లయ్య పాల్గొన్నారు.

కేసముద్రం: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి, పేద ప్రజలపై మోదీ సర్కార్ భారం మోపిందని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

చెట్టు పైనుంచి పడి వృద్ధుడి మృతి

కేసముద్రం: ప్రమాదవశాత్తు చింతచెట్టుపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇంటికన్నె గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండారు వెంకన్న(64) అనే వ్యక్తి చింతకాయలను దులిపేందుకు చింతచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారడంతో చెట్టుపై నుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని 108లో మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళకు గాయాలు

దంతాలపల్లి: బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయగా ఓ మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన గండి ఎల్లమ్మ తన పనిపై దంతాలపల్లి బస్టాండ్‌లో ఎల ్లమ్మ బస్సు ఎక్కింది, బస్సు అంబేడ్కర్ సెంటర్ కు చేరుకోగానే డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఎల్లమ్మ బస్సులో పడిపోయింది. దీంతో ఎల్లమ్మకు చేయి విరిగి, తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో తొర్రూరు తరలించారు.

మహిళ మృతికి కారకుడైన వ్యక్తి అరెస్ట్

డోర్నకల్: సీరోలు మండలం మోదుగగడ్డతండాకు చెదిన మహిళ మృతికి కారకుడైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మోదుగగడ్డతండాకు చెందిన దారావత్ పార్వతిపై అదే తండాకు చెందిన దారావత్ చంటి ఈనెల 2న అత్యాచారయత్నం చేయబోగా బంధువులు అడ్డుకోవడంతో పారిపోయాడు. మనస్తాపానికి గురైన పార్వతి అదే రోజు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బంధువులు ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ 4వ తేదీన మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి పార్వతి మృతికి కారకుడైన చంటిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ప్రధాన కార్యదర్శిగా అయిలయ్య



నెల్లికుదురు: వ్యాయామ విద్య, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నెల్లికుదురు ఫిజికల్ డైరెక్టర్ చెడుపల్లి అయిలయ్య ఎంపికయ్యారు.

సోమ్లాతండాలో చోరీ

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సోమ్లాతండాలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. తండాకు చెందిన వాంకుడోత్ వీరన్న, బుజ్జి తమ ఇంటికి తాళం వేసి వారంరోజులపాటు కొత్తగూడెం వెళ్లి సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి తలపులకు ఉన్న తాళం పగులగొట్టి ఉంది. బీరువాను పరిశీలించిగా.. సుమారు 15గ్రాముల బంగారు గొలుసుతోపాటు రూ.20వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

సంబురాలు

నెహ్రూసెంటర్: కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బాణాసంచా కాల్చి సంబురాలను నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, చిట్టిమళ్ల మహేష్, బెజ్జం ఐలయ్య, జ్యోతిబాబు, సిద్దు పాల్గొన్నారు.

గేట్ బహూకరణ

తొర్రూరు రూరల్: మండలంలోని గుడిబండా తండా ప్రాథమిక పాఠశాలకు దాత చేయూతనందించాడు. మండలంలోని పటేల్‌గూడెంకు చెందిన నల్ల ఎల్లారెడ్డి పాఠశాలకు రూ.25వేల విలువ చేసే ప్రధాన ద్వారం గేట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రావుల బుచ్చయ్య, కార్యదర్శి రాజమణి, వీఓ అహల్య, ఉపాధ్యాయుడు వినీల్ పాల్గొన్నారు.

ఆనకట్ట పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని పెద్దముప్పారం, రామానుజపురం, వేములపల్లి గ్రామాల రైతులకు సాగునీరు అందించే ఆనకట్టను మంగళవారం ఎస్సారెస్పీ డీఈ వినయ్ పరిశీలించారు. ఆనకట్టకు మరమ్మతులు చేయడం ద్వారా మండలంలోని గ్రామాలకు నీళ్లు అందుతాయన్నారు. కార్యక్రమంలో గురుపాల్ రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

కేసముద్రం: అకాల వర్షాలతో నష్టపోయిన బాధితులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంసీపీఐయూ పార్టీ ఆధ్వర్యంలో డీటీ ఎర్రయ్యకు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లోజు రామ్మోహనాచారి, దారావత్ రమేశ్ పాల్గొన్నారు.

బుడియా బాపు జాతర



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం శివారులోని సాంక్రియాతండా సమీపంలో గల మహంకాళి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో శ్రీసాంక్రియా సాదు (బుడియా బాపు) 34వ వార్షిక జాతర వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికీ ఆశీర్వచనాలు అందజేశారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

మహబూబాబాద్ రూరల్: మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ కేంద్రంలో పని చేసి మరణించిన కుటుంబాల పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఉద్యాన కళాశాలలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో షరీఫ్, సుమన్, ఉపేందర్, మైబు, షమీన, ఖతిజ, యాకుబ్ పాషా, సుల్తానా, యాకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: నేడు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని భావ్‌సింగ్ బావమాకుల ఆలయ ఆవరణంలోని నూతనంగా నిర్మించిన ఆలయంలో బంజారుల ఆరాధ్యదైవం మ్యారామయాడీ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని లంబాడీల ఐక్యవేదిక (లైవ్) రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త గుగులోతు రమేశ్‌నాయక్ మంగళవారం కోరాడు.

ఇసుక డంపు సీజ్

గార్ల: మండలంలోని ముల్కనూరులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు. 30ట్రిప్పుల ఇసుకను డంపు చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

మహబూబాబాద్ రూరల్: అకాల వర్షం, వడగళ్ల వాన, ఈదురుగాలులకు నష్టపోయిన వరిపంట పొలాలను మహబూబాబాద్ మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు

డోర్నకల్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని ముల్కలపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మాంగధరరావు తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ముద్రించిన కరపత్రాన్ని రుక్మాంగధరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విత్తనాల సుధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు బోనాలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం మూలమత్రితండా పరిధిలోని భూక్యతండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రేణుకాఎల్లమ్మ మునిరాజుల విగ్రహ ప్రతిష్ఠాపన మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజలు నిర్వహించి తల్లికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ భూక్య రాములునాయక్-జానకీ దంపతులు, భూక్య వెంకన్న-అనిత దంపతులు, మంచా, మధుకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమానురాగాలకు ప్రతీక 'ఈద్ మిలాప్'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్: ఈద్ మిలాప్ ప్రేమానురాగాలకు ప్రతీక అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. జమాతే ఇస్లామి హింద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రామాస్ స్కూల్‌లో ఈద్ మిలాప్ కార్యక్రమం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్ రావు మాట్లాడుతూ.. ఈద్ మిలాప్ మతాల మధ్య గల ధర్మాన్ని, ఆచారాలను పరస్పరం అవగాహన పెంపొందించటానికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు ఖలీద్ ముబషీర్, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ మజీద్ షోయబ్, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ సత్తార్, పట్టణ అధ్యక్షుడు ఎక్బాల్, డాక్టర్ బానోత్ నెహ్రూ రాథోడ్, మార్నేని వెంకన్న, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, రవికుమార్, బలాష్టి రమేశ్ పాల్గొన్నారు.